నిర్వహణకు నిధులు కరువు


కౌటాలలోని రైతువేదిక

- రెండేళ్లుగా అందని నిధులు
- ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు
- తాగునీరు, పారిశుధ్య నిర్వహణ కోసం పాట్లు
- జిల్లాలో 70 రైతువేదికలు

కౌటాల: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు సాగు, ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్, తదితర అంశాలపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడంతో పాటు ఇతర సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గత ప్రభుత్వం జిల్లాలోని 15 మండలాల్లో 70 రైతువేదికలు నిర్మించింది. ఒక్కోదానికి రూ. 22లక్షల చొప్పున రూ.15.40 కోట్లు వెచ్చించింది. క్లస్టర్‌కు ఒకరు చొప్పున వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)ను ప్రభుత్వం నియమించింది. రైతువేదికల నిర్వహణ వ్యవహారమంతా ఏఈవోలు చూసుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం కేటాయించిన సమయాల్లో ఏఈవోలు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటూ.. మిగతా సమయాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు పంట సాగులో తగిన సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంటుంది. రైతు వేదికల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా వసతుల ఏర్పాటుతో పాటు పారిశుధ్య నిర్వహణ, ప్రతీ మంగళవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ఏడాదిన్నరగా రైతువేదికల నిర్వహణకు నిధులు రాకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్లుగా నిధులేవి..?

అన్నదాతలకు సాగులో సూచనలు ఇచ్చేందుకు రైతు వేదికలను నిర్మించారు. కాని రైతు వేదికల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన రైతువేదిక భవనాలకు రక్షణ కరువైంది. రైతువేదికల చుట్టూ ప్రహరీలు లేకపోవడంతో మందుబాబులకు సిట్టింగ్ అడ్డాలుగా మారుతున్నాయి. రైతువేదికలను రోజూ తెరవాల్సి ఉన్నా కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒక్కసారి కూడా తెరుచుకోవడం లేదని ఆరోపణలున్నాయి. నిర్వహణ సరిగా లేక పలు రైతువేదికల్లో గోడలు, ఫ్లోర్‌పై పగుళ్లు వస్తున్నాయి. పలుచోట్ల గ్రామాలకు దూరంగా రైతువేదికలు ఉండడంతో తాగునీటి బోర్ మోటర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రైతువేదికల్లో సమావేశాలు నిర్వహించినప్పుడు హాజరైన రైతులు ఇతరుల కోసం టీ, బిస్కెట్లు అందజేయడంతో పాటు ఇతర వాటి కోసం కొంత డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిర్వహణ ఖర్చుల కింద గత ప్రభుత్వం నెలకు రూ.9 వేలు అందిస్తామని ప్రకటించింది. ఆగస్టు, 2022 వరకు నిధులు విడుదల చేసినా అనంతరం నిధులను నిలిపివేయడంతో వాటి నిర్వహణ భారంగా మారింది.

ఏఈవోలపై భారం

రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏఈవోలపై భారం పడుతోంది. మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్యం, కరెంట్ బిల్లుల చెల్లింపు, రైతులతో సమావేశాలు, ప్రభుత్వం చేపట్టిన రైతునేస్తం ముఖాముఖి కార్యక్రమాల నిర్వహణ సమయంలో టీ, బిస్కెట్లు, స్వీపర్ జీతం వంటి వాటికి నిధులు లేకపోవడంతో తామే భరించాల్సి వస్తుందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఏఈవోల వద్ద డబ్బులు లేకపోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపులు సైతం నిలిచిపోయినట్లు తెలుస్తోంది. రైతు వేదికల్లో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు, వివిధ శాఖల సమావేశాల నిర్వహణ సైతం జరుగుతోంది. సమావేశం అనంతరం వేదికలను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత ఏఈవోలపై పడుతోంది. మరోవైపు మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి నిధులు లేక ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, వరదలు, కోతుల బెడద కారణంగా జిల్లాలోని పలు రైతువేదికల్లో మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా.. నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. రైతు వేదికల నిర్వహణ కోసం ప్రతీ నెల నిధులు మంజూరు చేస్తే ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

నిర్వహణకు ఇబ్బందులు

గత రెండేళ్లుగా రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. చివరిగా 2022, ఆగస్టులో నిర్వహణ నిధులు విడుదల చేశారు. అనంతరం నిధులు రాకపోవడంతో నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్ బిల్లుల చెల్లింపు, పారిశుధ్య నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– ఘన్‌శ్యామ్, ఏఈవో, కౌటాల

ప్రభుత్వాసుపత్రికి సుస్తీ!


సరిపడా వసతులు లేక కింద కూర్చున్న రోగులు

- జైనూర్ ఆసుపత్రిలో వసతుల కొరత
- వైద్యులు లేక సకాలంలో అందని వైద్యసేవలు
- ఇబ్బంది పడుతున్న రోగులు

జైనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, మందులు, సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సీజన్ వ్యాధులు ప్రబలుతుండగా మండలంలోనూ జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాగా మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆసుపత్రిలో 10 మంది వైద్యులు ఉండాలి కానీ ఆసిఫాబాద్ నుంచి డెప్యూటేషన్‌పై ఒక వైద్యుడిని నియమించి సేవలందిస్తున్నారు. 14 మంది స్టాఫ్ నర్సులుండాల్సిన చోట కేవలం ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. కాగా ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జైనూర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌కు పరుగులు

ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటే రూ.600 నుంచి రూ.800 వరకు వసూలు చేస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న సామాన్యులకు ఇంత మొత్తం చెల్లించి పరీక్షలు చేయించుకోవడం తలకు మించిన భారంగా మారింది.

గర్భిణులకు తప్పని తిప్పలు..

మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో నిర్ధారణ పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే పరికరాలు ఉన్నా సంబంధిత నిపుణులు లేక నిరుపయోగంగా మారాయి. దీంతో స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్లక తప్పడం లేదు. కాగా సిర్పూర్ (యూ), జైనూర్, లింగాపూర్ మండలాలకు మూలకేంద్రమైన జైనూర్ ప్రభుత్వాసుపత్రిలో సరిపడా మందులు, వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులతో అరిగెల నాగేశ్వర్‌రావు

దహెగాం: యాదవ సంఘం మండల కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు సమక్షంలో ఎన్నుకున్నారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా బొల్లబోయిన రవి కుమార్, ఉపాధ్యక్షులుగా లింగమూర్తి, చరణ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రు, కోశాధికారిగా గొట్ల మల్లేశ్, యూత్ ప్రెసిడెంట్‌గా గొట్ల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా కుర్ర సతీశ్‌లతో పాటు తదితరులను ఎన్నుకన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ యాదవ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

రుణమాఫీ కోసం ధ్రువీకరణపత్రం అందజేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రూ. 2లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు వారి ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మిలింద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు, రేషన్‌కార్డు లేనివారు, వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, పట్టా పాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌తో ధ్రువీకరణ పత్రంపై పంచాయతీ కార్యదర్శి సంతకం చేసిన తరువాత వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, విడతల వారీగా అర్హులైన ప్రతీ రైతుకు పంట రుణాలు మాఫీ అవుతాయన్నారు.

కూరగాయల తోటల పరిశీలన


తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని, నజ్రూల్‌నగర్ గ్రామాల్లోని శివారులో గల కూరగాయల తోటలను మంగళవారం కాగజ్‌నగర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున చీడపీడల బెడద తట్టుకునేందుకు సూచనలు చేశారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించి సలహాలు పొందాలని ఆమె సూచించారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా రూప్‌లాల్


రూప్‌లాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

కెరమెరి: సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన రూప్‌లాల్ నాయక్‌ను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబోతు రాంబాబు తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా జనగామలో జరిగిన కార్యక్రమంలో రూప్‌లాల్ పేరును ప్రకటించారు. కాగా మండలాధ్యక్షుడుగా రాథోడ్ రమేశ్‌ను ఎన్నుకున్నారు.

ఆదివాసీ విద్యార్థికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

జైనూర్: సిర్పూర్(యూ) మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన మర్సుకోల సాక్రుబాయి –బాదిరావు దంపతుల కుమారుడు కృష్ణ రాయ్‌పూర్‌లోని ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించాడు. నిరుపేద కుటుంబం కావడంతో రాణి దుర్గావతి మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. జ్యోత్స్న, ఏత్మా, చందుబాయి, రాధాబాయి, సుందరబాయి, తులసీబాయి తదితరులు ఉన్నారు.

పత్తి మొక్కలు ధ్వంసం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్తసారసాల గ్రామ శివారులోని సర్వే నెం.193లో గల కొంతకాలంగా సాగుచేస్తున్న తమ భూముల్లో నాటిన పత్తి మొక్కలను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేశారని బాధితులు ఇందిరా, కమల ఆరోపించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


దహెగాం: ఉట్టి కొడుతున్న యువకులు

దహెగాం: మండలంలోని పాత లగ్గాంలోని కేశవనాథ ఆలయ ఆవరణలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సోమవారం ప్రారంభించిన ఎక్కాహం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్ర మం నిర్వహించారు. అయా గ్రామాలకు చెందిన జట్లు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆసిఫాబాద్‌అర్బన్: కృష్ణాష్టమి పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని శ్రీవాసవి ఉన్నత పాఠశాలలో పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు గోపికలు, కృష్ణుడి వేషధారణలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని కన్నెపల్లి హనుమాన్ ఆలయంలో మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో గోపాలకాల నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఏటా గోపాలకాల నిర్వహిస్తామని, గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఉయ్యాల సేవలో భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం అర్ధరాత్రి శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉయ్యాలలో కృష్ణుడిని పెట్టి పాటలు పాడుతూ పూజలు చేశారు. మంగళవారం ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. 24 గంటలపాటు భజనలు చేశారు.


ఆసిఫాబాద్‌అర్బన్: వేడుకల్లో చిన్నారులు


కౌటాల: పూజలు చేస్తున్న భక్తులు

ఏజెన్సీ బంద్ విజయవంతం

తిర్యాణి: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం చేపట్టిన ఏజెన్సీ బంద్ మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టి తహసీల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్ 3ను కొనసాగిస్తూ, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల భర్తీ చేపట్టాలన్నారు. గత ఏడాది మంజూరైనా ట్రైకార్ లోన్లను వెంటనే మంజూరు చేసి ఆదివాసీల స్వయం అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని విద్యాసంస్థలు, దుకాణా సముదాయాలను మూసివేయించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, రాజ్‌గోండు సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గుణవంత్‌రావు, తుడుందెబ్బ జిల్లా కోఆర్డినేటర్ గెడం సుభాశ్, ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు, మండల అధ్యక్షుడు తోడసం భాస్కర్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: తుడుందెబ్బ పిలుపు మేరకు మండల కేంద్రంలో మంగళవారం సంపూర్ణ బంద్ నిర్వహించారు. వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, వైన్స్, ఇతర సముదాయాలు, విద్యాసంస్థలు బంద్ పాటించారు. మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ నాయకుడు కొడప శంకర్, కోరెత తిరుపతి, సర్దార్‌జీ, పుల్లయ్య, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలనే పలు డిమాండ్లతో తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ మండలంలో విజయవంతమైంది. ఉదయమే ఆదివాసీ సంఘాల నాయకులు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ దుకాణాలు బంద్ చేయించారు. పలువురు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


బెజ్జూర్: రోడ్డుపై బైఠాయించిన ఆదివాసీ నాయకులు

కెరమెరి: తుడుందెబ్బ ఇచ్చిన బంద్ మండల కేంద్రంలో మంగళవారం విజయవంతమైంది. ఉదయం నుంచి సాయంకాలం వరకు వ్యాపార సముదాయాలు మూసి ఉంచారు. కిరాణా దుకాణాలు, హోటళ్లు, కిల్లికొట్లు, సెల్‌ఫోన్ షాపులు, బట్టల దుకాణాలు, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలు తెరవక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా ప్రైవేటు క్లినిక్‌లు, మెడికల్ షాపులు యథావిధిగా పనిచేశాయి.

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి

జైనూర్: ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన 1ఆఫ్70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు అన్నారు. మంగళవారం ఆదివాసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్నారు. ఎస్టీ జాబితా నుంచి చట్టబద్ధత లేని లంబాడీలను తొలగించాలన్నారు. జీవో నంబర్3ను యథావిధంగా అమలు చేయాలన్నారు. ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను అర్హులైన ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేయాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక ఆదివాసీ పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ తిరుపతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, ఆదివాసీ సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి మెస్రం అంబాజీ, ఆదివాసీ సంఘాల నాయకులు కోట్నాక దౌలత్‌రావు, ఉర్వేత జంగు, కుమ్ర దుందేరావు, కనక రాంజీ, సోయం గుణవంత్‌రావు, పెందూర్ అర్జున్, ఆడ దుందేరావు ఉన్నారు.


తిర్యాణి: మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు


జైనూర్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కెరమెరి: మూసి ఉన్న దుకాణాలు


వాంకిడి: దుకాణాలు బంద్ చేస్తున్న నాయకులు

చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన గోలేటి మారుతి సతీమణి శారదకు సంస్థ ద్వారా మంజూరైన రూ.5.36 లక్షల చెక్కును మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అందజేశారు. గోలేటి మారుతి గతేడాది తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సాంస్కృతిక సారథి కళాకారులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

జోష్ నింపిన తీజ్ ఉత్సవం

కెరమెరి: మండలంలోని సకారాంగూడ, చందుగూడ, అనార్‌పల్లి, దేవాపూర్ గ్రామాల్లో మంగళవారం అత్యంత ఘనంగా తీజ్ ఉత్సవాలను జరుపుకున్నారు. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఉత్సవాన్ని జరుపుకున్నారు. గడిచిన తొమ్మిది రోజుల నుంచి బుట్టల్లో పెంచుతున్న గోధుమ విత్తనాలకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నీరు పోశారు. ఈ సందర్భంగా యువతులు గోధుమ బుట్టలను నెత్తిపై పెట్టకొని ఉత్సాహంగా సాంప్రదాయ నృత్యం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రెబ్బెన: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మండలంలోని గోలేటి గ్రామంలో గల సింగరేణి సంస్థకు చెందిన ఓ ఇంటిలో మంగళవారం పేకాట ఆడుతున్న స్వామి, భాస్కర్, బుచ్చయ్య, కుమారస్వామి అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నడుస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి దాతల సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

పెంచికల్‌పేట్: ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్ వారం రోజుల క్రితం పిడుగుపడి మృతి చెందగా బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు యువకులు ముందుకొచ్చారు. దాతల సహాయంతో సేకరించిన రూ.31వేల నగదును మృతుడి భార్య కాంతాబాయికి అందజేశారు. కార్యక్రమంలో యువకులు గణేశ్, సాయి, మహేందర్, అనిల్, మల్లన్న, శివాని తదితరులు పాల్గొన్నారు.